# తుఫాను

## పురాణపండ రంగనాథ్

**తు**ఫాను ... ఇంటా, బయటా, సర్వత్రా తుఫాను. బయట తుఫాను ప్రకృతి విపర్యయం. ప్రకృతి విపర్యయ ఫలితం ఇంటిలో తుఫాను. మరి మనస్సులోని తుఫాను... అనుకొన్నది జరగకపోతే తుఫాను. ఒకవేళ దైవం అనుకూలించి జరిగినా ఫలితం బాగుండక పోతే తుఫాను. ఒకటి నిరాశ. మరొకటి అసంతృప్తి. ఏదైనా మనస్సును కలిచివేసేదే. ప్రకృతి విపర్యయంవల్ల తుఫానులు అప్పుడప్పుడు వస్తాయి. కాని మంచి మనస్సున్న వాళ్లకు బ్రతికున్నంత కాలం తుఫానే.

* * *

తుఫాను విజృంభించి ఇంటికప్పుల్ని ఎగర కొడుతూంది. బంగాళ పెంకులు విస్తరాకుల్లా లేచిపోతున్నప్పుడు తాటాకుల గురించి వేరే చెప్పాలా? అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని రోడ్డు కెక్కారు అలగా జనం. రోడ్డుమీద చెట్లు ఫెళ ఫెళ విరిగిపోతున్నాయి. పిల్లలు పోరు పెట్టి ఏడుస్తున్నారు. పెద్దా, చిన్నా భేదంలేకుండా అందరూ భయంతో కంపిస్తున్నారు. అంతకంతకూ గాలి ఉధృత మవుతూంది కాని, తగ్గుముఖం పట్టే సూచనలేం కనబడ్డంలేదు. ఏం చేయడానికీ దిక్కులు తోచడం లేదు వాళ్లకు.

ఇంతలో దేవుడి మల్లే నరసరాజు, మరిద్దరు యువకులూ వచ్చారు. అలగా జనాన్ని దగ్గరలో ఉన్న సినిమా హాలులో ప్రవేశపెట్టారు. ఇంకా మిగిలిన వారిని స్కూలులోకి వెళ్లమన్నారు. అందరూ నరసరాజుని లోలోపలే దీవించారు, కొందరు పైకే పొగిడేశారు.

అగ్గిపెట్టెల్లాంటి గూళ్లలో బ్రతుకులు వెళ్లబుచ్చుకొనే వాళ్ల కా రాత్రి మనస్సుల్లో ఆనందం. పైకి విచారం, భయం—రెండూ ఉన్నాయి. ఎన్నాళ్ల నుండో తమను రక్షిస్తున్న గుడిసెలు, జీవన నిర్వహణకు ఉపకరిస్తున్న సామగ్రి నేలమట్టమైనాయనే విచారం. రేపు ఏం చేయాలనే బాధ.

'ఈ గచ్చు, రేకుల మకాం బాగుంది. ఈవేళ బతికితే రేపు చింతాకులు తిని బతుకుదాం' అనే ధైర్యం, ఆశ వాళ్లలో గూళ్లు చేసుకున్నాయి. ఆ రాత్రి ... కరెంటు పోయింది. దీపాలు కావాలి. చిన్నదీపాలు ఎన్ని పెడితే మాత్రం అందరికీ సరిపోయేంత కాంతి వస్తుంది?

నరసరాజు అలగా జనం గురించి ఆలోచిస్తున్నాడు.

"బాబయ్యా! పెట్రమాక్స్ లైటు కావాల్నా?" జీవరత్నం అనే రిక్షావాలా వచ్చి అడిగాడు. నరసరాజు తల ఎత్తి చూశాడు. నవ్వో, ఏడుపో, ఆశో, నిరాశో! —జీవరత్నం ముఖంలో తెలియడం లేదు. ప్రస్తుత సమస్య అతడి ముఖంలో ప్రశ్నార్థకంగా వెలుగుతూంది. నరసరాజు జేబులోంచి పెన్ను, నలిగిన కాగితం తీసి గబగబ బరికి జీవరత్నానికి ఇచ్చాడు.

"ఇది పట్టాభిరామయ్య కియ్యి. లైటు ఇస్తాడు. పట్టుకు రా."

జీవతర్నం పైమీదున్న తువ్వాలు నెత్తిమీద లాక్కుని, సన్నగా వీస్తున్న గాలిలోని దూసుకుపోయాడు.

'లైటు వస్తుంది. తరవాత ... పిళ్లను చలినుండి కాపాడడానికి బట్టలు కావాలి. చంటిపిల్లలు, వృద్ధులు చలికి తాళలేరు. ఎలాగ? ఇళ్లలో అద్దాల బీరువాల్లో దుప్పట్లు మడతలు పెట్టుకొనే వాళ్లు ఇలాంటి వేళల్లోనైనా వాటిని తీసి ఇవ్వరా? అసలు వాళ్లు కప్పుకుంటారా? అని. మడతలు విప్పితే దుప్పట్లకే చలివేస్తుందనే జాలి పాపం వాళ్లది.

జడివల్ల, ఈదురుగాలి వల్ల వణుకుతూ కామేశం వచ్చాడు. వెళ్లిన పని అవలేదని నరసరాజు కామేశం ముఖం చూసే పసిగట్టేశాడు.

"వీథిలోనికొస్తే ప్రాణాలు పోయేట్లున్నాయి. పెంకులు విస్తరాకుల్లా ఎగిరి పడుతున్నాయి. ఇంత నష్టం, కష్టం వచ్చిన టైములో మధ్య ఈ గొడవేమిటయ్యా అన్నారు" కామేశం ముడుచుకు కూర్చుంటూ.

"ఈ మాత్రం సాయం చేయలేమని చెప్పక ఈ పురాణం అంతా ఎందుకు? వాళ్లవే ప్రాణాలు మరి. వీళ్లవి జీవాలు కావు" నరసరాజు విసుక్కున్నాడు.

ఆపదలు వచ్చినప్పుడు పెద్దాళ్లూ, గొప్పాళ్లూ నడుం కట్టవలసిందిపోయి, కుర్రకారు ముందుకు వస్తే కొంచెం బియ్యం, కట్టెలు, నాలుగు గుడ్డలు అడిగితే ఇలా విసిరి కొట్టడం విసుగేకాదు, ఎవరికైనా ఆ సమయంలో కోపం వస్తుంది.

"బాబూ! కళ్లొడుసుకున్నా కాన రావటం లేదు. చంటి బిడ్డలు పోరెడుతున్నారు." మాచరమ్మ ఆదరాబాదరా వచ్చి, చిరిగిపోయిన చీర చెరగునే నిండుగా కప్పుకుని అంది, వణుకుతున్న పెదాలను బలవంతంగా నొక్కుకుంటూ.

"లైటుకు పంపానమ్మా" అన్నాడు.

"అది సరే, బాబూ! కంపడే సీకటి నైటొస్తే పొద్ది, అంపడని ఆకలి బాధ."

మాచరమ్మ తెలివికి నరసరాజు నవ్వుకున్నాడు.

"చంటి బిడ్డలకు పాలు గావాలి."

"నే తెస్తా! మువ్విక్కడ ఉండరా."

"ఎన్ని పాలని తేగలవురా? దూడలు తాళ్లు తెంపుకు పోయాయని ఒక్కటే



**తుఫాను బీభత్సం మూలంగా పలువురు పేదలు ఆశ్రయం కోల్పోయారు. మంచి మనసు ఉన్న యువకులు ముందుకు వచ్చి ఆశ్రయం కల్పించారు. కన్ను పొడుచుకున్నా కానరాని కటిక చీకటి పారద్రోలడానికి ఉపాయం ఆలోచించారు. ఎవరినో యాచించి ఒక పెట్రోమాక్స్ లైటు సంపాదించారు. ఆశ్రయం పొందినవారిలోనే ఒకడు దాన్ని సారాకొట్టు యజమానికి మదుపుపెట్టి గుర్రం ఎక్కాడు! అదీ బ్రతుకంటే.**

గోలగా ఉంది ఊళ్లో. కూర్చుందూ, వృథా ప్రయాసపడక." కామేశం సిగరెట్ వెలిగించుకున్నాడు. అగ్గిపుల్ల ఎంతో సేపు వెలగలేదు కాని, వెలిగినంత సేపూ కామేశం ముఖంలోని నిర్లిప్తతను చూపిస్తూనే ఉంది.

"మనకు సాధ్యమైన సాయం చేశాం. చేసేవాడుంటే పిల్లు ఎన్నైనా చేయించుకుంటారు."

వెళ్లడానికి సిద్ధమవుతున్న నరసరాజును హెచ్చరించాడు కామేశం. నరసరాజు పొడిగా నవ్వాడు. నిర్లిప్తతకు, ప్రతిఘటనకు అతీతమైన సేవాధర్మం నరసరాజుది. కొంతమటుకు చేశాం—అవే తృప్తి, ఎంతని చేయగలం—అనే నిర్లిప్తత కామేశం అవలంబించే సేవా ధర్మం.

"ఏదో ఓ హోటల్లో ఉండకపోవు, ప్రయత్నిస్తా" అని నరసరాజు చరచర వెళ్లిపోయాడు.

"మా రాజు ఎంత కష్టపడతన్నాడో?" మాచరమ్మ కృతజ్ఞతగా చూసి సినిమా హాలులో తమకు కేటాయించిన జాగాలోకి వెళ్లిపోయింది.

పేరుకుంటున్న చీకటిలోకిచూస్తున్న కామేశం ఏకాగ్రతను భంగపరుస్తూ పరంజ్యోతి — "ఏం కామేశంగారూ" అంటూ వచ్చింది. పద్దెనిమిదేళ్ల పరంజ్యోతి నల్లగా ఉంటుంది. సరిగా తోడుకోని పెరుగులా తొణుకుతాయి ఆమె శరీరంలో కండరాలు. బింకం చెడిన పడతి పరంజ్యోతి. అంటే పరంజ్యోతి [illegible] మనిషి. హైస్కూల్లో ఏడు [illegible]. అప్పుడే 'సెక్స్' పుస్తకాలు బాగా 'స్టడీ' చేసింది. వాటి సారం బుర్రలో జీర్ణమయేసరికి పరంజ్యోతి కోరికల తూరీగలు రాగాలు తీశాయి. చెడింది. ఆ పెద్ద ఊరికి దగ్గరగా ఉన్న రాజమండ్రి, కాకినాడలకు తీసుకుపోయి షురానా మనుష్యులు, కామందులు, శృంగారమే జీవితాదర్శమైన నాయుడు బావలు పరంజ్యోతిని అనుభవిస్తుంటారు. పదిమంది చేతుల్లో నలగడం వల్ల పరంజ్యోతి శరీరం కదిలింది. పదిమందిని ఎలా తిప్పుకోవాలో, ఎలా తను మెలగాలో బాగా నేర్చుకున్న నెరజాణ జ్యోతి.

"ఏం జ్యోతీ! ఈ తుఫాను నీకేబాగా బాధ!" కామేశం బాగా వేళాకోళం చేశాడు. చీకటి మూలంగా పరంజ్యోతి కదలికలు సరిగా ఆనడం లేదు కాని ఆమె వేళ్ళు పైకండువా చిగుళ్లను మెలిదిప్పుతున్నట్లు మాత్రం కనబడుతూంది.

"మరే పాపం! నీబోటోడు చలికి వణికిపోతుంటాడని నాకు బలే గుబులైంది!"

ఇలాంటి మాట అంటున్నప్పుడు ఆమె కళ్ళు చక్రాల్లా తిరిగి, నోరు ఒక్కపిడతలా అయి, పెదాలు ప్రశ్నార్థకంగా నిలబడడం కామేశం ఇదివరకు బజారులో చూశాడు. అంతేకాదు. ఎదురు సమాధానం చెప్పేటప్పుడు ఎదుటి మనిషిని కవ్వించాలనే ఉద్దేశ్యంతో కాబోలు ఉరోజాలు కనిపించేలా పమిట సర్దుకొంటుంది.

"అవున్లేపాపం! నాబోటి వాళ్లకు సేవచేసి తరిస్తున్నావ్ — వాళ్లను 'హాస్పిటల్స్'కు పంపి!" కామేశం తక్కువ తిన్న వాడేం కాదు.

"మీరు మాత్రం మా ఆడాళ్లకు డబ్బు రూపంలో సేవచేయడంలేదేటి!" జ్యోతి మాటలకు తడుముకోలేదు.

మరి మాటాడక రోడ్డు వైపు చూస్తూండిపోయాడు. ఎప్పుడూ అందంగా, ప్రశాంతంగా మెరిసే తారు రోడ్డు ఆ వేళ భయంగా, భయంకరంగా ఆవులిస్తున్నట్లుంది. జీవరత్నం 'లైటు' తెస్తున్నాడు. ఆ కాంతిలో రోడ్డు ముఖం కొత్తగా వితంతువైన పడుచు నుదురులా మెరుస్తూంది.

"నా సామిరంగా! కలిగినోళ్ల కన్న మధ్యరకం వాళ్లే సాలానయం. రామయ్య గోరింటో అయిదు కుటుంబాలోళ్లు తలదాచుకున్నారు. ఆరికీ 'లైటు' అవసరమే. కాని యీడ ముఖ్యమని యిచ్చింద్రు. కలిగినోళ్లు దీపాలే యెలిగించుకోలే దనలు." జీవరత్నం వసబోసినట్లు బడబడ మంటున్నాడు.

"పిచ్చిమావా! దీపం పెడ్తే పురుగులు చేర్తాయి. అలాగే కలిగినోళ్ల ఇంట్లో దీపం పెడ్తే మనబోట్లం వెళ్తామని వాళ్లభయం" జ్యోతి గలగల నవ్వింది.

అలా నవ్వుతున్నప్పుడు ఉరికురికి పడుతున్న ఆమె వక్షోజాల వైపే చూస్తూండి పోయాడు కామేశం. జీవరత్నం వింతగా జ్యోతిని చూసి హాలులో కల్లి ఎత్తైన పీటమీద లైటు పెట్టాడు.

కొండంత భయం పోయినట్లు జనం దీపాన్ని చూస్తూనే ఆనందంగా అరచేతులు కళ్ల కద్దుకున్నారు. కొందరాడాళ్లు మంగళసూత్రాలు, అవిలేని వాళ్లు పసుపు కొమ్ములు కట్టిన తాళ్లను, కళ్ల కద్దుకొని, పిల్లలచేత దీపానికి దండం పెట్టించారు. అది చూస్తున్న జీవరత్నం గుండెల్లో తృప్తి, ఆనందం కెరటంలా పొంగాయి.

"ఇన్ని కుటుంబాలోళ్లు చల్లగా దండం పెడ్తే లైటిచ్చినోరికి చలవగా దేంటదీ. అది తెల్సుకోవాల్నంతే." జీవరత్నం కామేశం, జ్యోతి ఉన్న చోటుకు వచ్చాడు.

"ఏం మావా! ఏదో ఒకటి మాట్లాడుతూ గాని పనిచేయలేవేంటి?" నవ్వింది జ్యోతి.

"నీకు నవ్వేనే పిల్లా! నూడు మనోళ్లు ఎట్టాగున్నారో. నీతో జెట్టాపట్టా లేసుకు తిరిగే రాజు లెవరైనా నూడొచ్చారా?"

"వెర్రిబాగులోడా! వాళ్ల పద్ధతులు వేరు. మన అలవాట్లు వేరు. నేను వాళ్లకావలసిన పద్ధతిలో ఉంటాను. నన్ను రాసుకు తిరుగుతారు. మీ రలా ఉండలేరు. వాళ్లు ఇక్కడ కొస్తే ఒక్క క్షణం ఉండలేరు ఆ!"

పరంజ్యోతి వయస్సుకన్న అనుభవం పెద్దదని కామేశం నిర్ధారించుకున్నాడు. తెల్లటి లైటు కాంతిలో పరంజ్యోతి నల్లతాచులా నిగనిగలాడుతూంది.

"నాలుగు డబ్బులడేస్తారు. అందుకే అల్లంటే నీకు భయం ... ఇష్టం గుర్నాగారేరీ?"

"పాలకోసం వెళ్లారు. వస్తారు" పరంజ్యోతి అక్కడ నిలబడక లోనకు పరుగెత్తింది.

"ఏంటో దీ నారన... ఇలా సెడ తిరుగుద్ది." జీవరత్నం చుట్ట వెలిగించుకున్నాడు.

కామేశం హాలులోకి చూస్తూండిపోయాడు.

ముడతలుపడ్డ చర్మాలే ఆచ్ఛాదనగా అస్థిపంజరాలలో ప్రాణాలు నిలబెట్టుకొంటున్న వృద్ధులు అడ్డు పొగ వేస్తున్నారు. అప్పుడు వాళ్ల చప్పిడి బుగ్గలు కొలిమి తిత్తిలా ఉబికిపడి ముడుచుకొంటున్నాయి. వాళ్లకళ్లు అనుభవించిన జీవితపు లోతులు. అదొక రకం తరం.

మధ్యతరగతి వయస్సు పురుషులు, స్త్రీలు పిల్లల్ని దగ్గర కూర్చోబెట్టుకొని తుఫాను గురించి మాట్లాడుకుంటున్నారు. అదొకతరం. అనుభవిస్తూ, ఇంకా ముందు జీవితంలో ఎంతో అనుభవించాలనే ఆశతో నేటికి గడుపుతున్న వాళ్లు. వాళ్ల కండరాలు, రేపుకు ఆహ్వాన సంఘాలు.

ఏమీ తెలియని బాలురు ఒకచో గుమిగూడి ఆటలాడు తున్నారు. ఎప్పుడో చూసిన సినిమాలో హీరోలా ఒక కుర్రాడు 'పోజు' పెట్టి ఏదో చెపుతుంటే మిగతా పిల్లలు వింటున్నారు. ఇదొక తరం. నిన్న ప్రమాదం గాని,

క్షుద్బాధ — ఫోటో—వై. విఠల్‌రావు (మద్రాసు-53)



ఈవేళ ఆపదగాని, రేపు ఆలోచనగాని వాళ్లకు లేదు. కాని ఈనాటి వాళ్ల జీవిత విధానాలు, సంస్కారాలు, అనుభవాలు రేపుకు ప్రతిబింబాలు.

నరసరాజు డబ్బాతో పాలు తెచ్చాడు. బాగా అవసరమైన పిల్లలకే పరంజ్యోతి, కామేశం, జీవరత్నం కలిసి పాలుపంచారు. డబ్బా ఖాళీ అయింది.

ఆ రాత్రి ఎవరికీ తిండి విషయం గుర్తుకే రాలేదు. "వాళ్ల కొంప లెలా ఉన్నాయో? ఆరి దూడలేమైనాయో! మనకొంపలు మట్టేలే" ఇలాంటి కబుర్లతో, సానుభూతులతో, బాధలతో రాత్రి గడిపారు.

మామూలుగా భళ్లున తెల్లారుతుంది. కాని. ఆ వేళ భయంకర నిరీక్షణను, నిరుత్సాహాన్ని, మళ్లీ తుఫాను గాలి రాదు కదా అనే భయాన్ని మింగి తెల్లవారింది.

కను చీకటి ఉండగానే మిల్లుకు వెళ్లి, బతిమాలి అరబస్తా నూకలు తెచ్చి గంజి కాచి పోశారు. గంజి గొంతుక దిగకుండానే తమ కొంపల గురించి పోయారు అలగా జనం.

నరసరాజు మిత్రులతో కలిసి నలుగురు కూలీలను తీసుకుని చందాకు బయలుదేరాడు. దయతలిచి ఇచ్చిన వాళ్లు ఇచ్చారు. ఇవ్వనివాళ్లు శాపనార్థాలు పెట్టారు. వర్తక సంఘం వారు బస్తా బియ్యం, మరి నలుగురు పెద్ద కామందులు తలొక అరబస్తా బియ్యం ఇచ్చారు. పదార్థాలు బాగానే పోగయ్యాయి. సత్రవులో వంటలకు పురమాయించి నరసరాజు, కామేశం అలాగా జనం కొంపల దగ్గరకు వచ్చారు. అక్కడ ఘర్షణ రగులుతూంది.

"ఎధవ సన్నాసీ! తాటాకులు నా ఇంటివి ఏరుకుపోయి గుట్టెడతావా?" ఒకతను పక్కఇంటివాడితో దెబ్బలాడుతున్నాడు.

"నీకేం బుద్ధీ గిద్దీ లేదేంటి? సూడె హే — గాలికి వాలులో మీ ఇల్లుంది. మా ఇల్లు పైన ఉంది. ఏ ఆకులిక్కడ పడతాయో సూడరా గాడిదా!" రెండవ అతను అరుస్తున్నాడు.

పదిమందీ చేరి చోద్యం చూస్తున్నారు తప్ప ఎవ్వరూ ఎవరికి సలహా ఇవ్వడం లేదు. వారి యుద్ధాన్ని శాంతింప చేసే ప్రయత్నమూ చేయడం లేదు. వాళ్లిద్దరూ "నీయమ్మంటే — నీయమ్మనే" వరకు వచ్చారు.

"నీ యాలి రంకుదంటే — నీ ఆలి లంజముండ" అని శాపనార్థాలు ప్రారంభించారు.

తాటాకుల గొడవ తాళికట్టిన భార్యల వరకు పెరిగింది. సహించలేని నరసరాజు కలిగించుకొన్నాడు.

"అబ్బాయ్! సూరయ్యా!" పిలిచాడు.

పల్లంలో, గాలికి వాలులో క్రింద ఉన్న ఇంటి యజమాని సూరయ్య కోపంగా వచ్చాడు.

"సూడండి బాబూ! నా ఆకులు తీసుక పోతున్నాడు. ఇంటిమీద వేసినా కోసేసి తీసుకుంటాను" అన్నాడు కసిగా, ఉక్రోషంగా ఎదుటి వాణ్ణి చూస్తూ.

"ఇద్దరూ ఆకులన్నీ గుట్టగా పోగేయండి. ఇల్లు వేసినప్పుడు తీసుకుందురు గాని." నబువు చెప్పాలను కున్నాడు రాజు.

శాలేవయ్యా! తగూ చెప్పొచ్చావ్. నా ఇల్లు దట్టంగా వేసుకున్నాను. ఆడిల్లు పల్సగా పేర్సుకు పోయాడు. సమంగా పంచుకోవడం కుదరద్దు. అదీగాక నా ఇంటి దడి ఆకులుకోడిందులున్నాయి." సూరయ్య విరుచుకు పడుతున్నట్లు అరుస్తున్నాడు.

"నెమ్మదిగా మాట్లాడు. గండం గడిచి బయటపడ్డాం. సర్దుకుపోవాలి కాని ఇలా పోట్లాడుకోవడం ఏం బాగులేదు."

"మా బాగోగులు మాకు తెలుసులేవయ్యా! ఎళ్లి నీ పని సూసుకో — పెద్ద ఆరిందాలా తీర్పు సెప్తున్నావ్!" సూరయ్య కసురుకుంటూ అక్కడి నుండి వెళ్లిపోయాడు.

"వాళ్లకు సుఖం కలిగించడమేగా నా పని!" నరసరాజు గొణుక్కున్నాడు.

"వీళ్లతో కూర్చుంటే తెమలదురా! నడు." కామేశం నరసరాజు భుజం తట్టాడు.

ఇద్దరూ కూలీపేట సందులగుండా నడవసాగారు.

రాబందులు పీకేసిన అస్థిపంజరంలాగుంది వాతావరణం.

"చూడండి బాబూ! జీవరత్నం











రైల్వేస్టేషన్ వద్ద :
రామాలయం వీధి

రోడ్డుమీద విరిగి పడిన పెద్ద రావి కొమ్మ దాచేస్తున్నాడు." పరంజ్యోతి పరుగున వచ్చి వాళ్లతో చెప్పింది దారిలో.

"ఇదో పితూరీ. రారా, పోదాం. వాడు నాలుగు డబ్బులు చేసుకుందుకు ఆ రావి కొమ్మ దాచుకొన్నాడు, ఇందులో నీ ధర్మపన్నాలు అనవసరం." కామేశం నరసరాజుని గెంటాడు.

"అది ప్రభుత్వం ఆస్తి. అందరూ సమానంగా అనుభవించాలి. అదీగాక అది వేలంవేసేది. ఇలా అన్యాయంగా దాచేయడం తగదు." నరసరాజు గింజుకొంటున్నాడు.

"వేలంవేస్తే వీళ్లు పాడుకోలేరురా. పేరున్న పెద్దోళ్లు కొట్టుకు పోతారు. ఇలాంటప్పుడు అన్యాయం అంటూ కూర్చుంటే వీళ్లకు మనం చేసే ఉపకారం ఏం ఉండదు."

"అట్టాగుండాల మారాజ బుద్ధి." అక్కడకు అప్పుడే వచ్చిన జీవరత్నం ఆనందంగా అన్నాడు. నరసరాజు మాట్లాడలేదు.

"దీనిమొహానికి నీతున్నట్టు నా మీద పితూరీ చేస్తోంది" జీవరత్నం పరంజ్యోతిని కురకురలాడుతూ చూశాడు.

"పోరా సన్నాసీ! నీవంటి వాడికి సాయంచేయడం కన్న చేతులు నరుక్కోవడం నయం" అంటూ పరంజ్యోతి తుర్రుమంది.

"ఏం — నడుస్తావా?"

పరధ్యాన్నంగా ఉన్న నరసరాజు కామేశం హెచ్చరించడంతో ముందడుగు వేశాడు.

అధర్మానికీ, ధర్మానికీ మధ్య సరిహద్దు గీత చాలా చిన్నది. గట్టిది. కష్టమైనది.

బలహీన మనస్కులు ఆ గీతను సులభంగా దాట గలరు. కొంచెం ఆలోచించే వాళ్లు, సున్నిత మనస్కులు ఆ గీత దాటలేరు.

యుద్ధంలో బలానికి జయం. ఇక్కడ బలహీనతకు లాభం, యుద్ధంలో జయంవల్ల వచ్చిన లాభానికీ, ఇక్కడ లాభం వల్ల కలిగిన జయానికీ సరిహద్దు ఏది?

నరసరాజు ఆలోచిస్తూనే వంటలు చేస్తున్న చోటుకు వచ్చేశాడు. నలుగురాడపిల్లలు చింతపండు బాగు చేస్తున్నారు. వారి వెనక నిలబడి అయిదారుగురు షోకిల్లాలు పరాచకాలాడుతున్నారు.

ప్రమాదం తప్పి ఇంకా అందరూ కోలుకోలేదు. అప్పుడే వీళ్లకీ నిర్విచారం ఏమిటి? వేళాకోళా లేమిటి? పనిచేస్తున్నారు తప్ప దీక్ష, తత్పరత లేవు. చేయడంలో వారికి గర్వం ఉంది.

మధ్యాహ్నం రెండింటికి భోజనాలయాయి. ఇంకా మరొక పూటకు సరిపడే సామగ్రి మిగిలింది. కొంచెం బియ్యం ఉంటే చాలు. నరసరాజు మరల చందాకు బయలుదేరాడు ఆ సాయంత్రం. ఇదివరకు ఇవ్వని వాళ్లు ఈ పారి తోచినంత సాయం చేశారు. ఇవ్వనివాళ్లు అప్పుడూ ఇవ్వలేదు, ఇప్పుడూ ఇవ్వలేదు. ఆ రకం మనుష్యులు విమర్శలు మాత్రం బాగా చేశారు. చందాలు చేస్తున్నప్పుడే చూశాడు నరసరాజు. కొందరు మధ్యతరగతి వాళ్లు ఇళ్లు వేసుకొంటున్నారు. భార్య అందిస్తున్న తాటాకులు అందుకొని వేస్తున్నాడు భర్త.

"ఏరదీ?" మధ్యతరగతి కూలి అడిగాడు.

"లేబరోళ్లకు సంతర్పణ చేస్తారట. చందాల కొచ్చారు" అంది భార్య.

"లేబరోళ్లు, లేబరోళ్లు — పభుత్వానికీ ఇదే పాట. పెద్దోళ్లకీ ఇదే పాట. మధ్యతరగతోళ్లం ఎలాపోతేనేం? ఎవడిక్కావాలి, ఈయాల ఇల్లు నేసుకుంటున్నాం — రేపు అధికారులొచ్చి బాగున్న ఇంటికి డబ్బియ్యం అంటారు. ఎటొచ్చినా నష్టం మధ్యతరగతోడికే." ఆ కూలీ బాధగా, నిరాశగా, కోపంగా అన్నాడు.

నిజమే. ప్రభుత్వం ఎలాగూ తుఫాను బాధితులకు సాయం చేస్తుంది. అప్పుడు ఇలాంటి వాళ్లకు ఏ సాయమూ అందదు.

"మధ్యతరగతోళ్లు మనుషులుగారనా ఆళ్లు తినక్కరలేదనా? ఆ మేట్టారు నూడు— నిన్ననుంచి ఎలాగున్నాడో— సంసారం బయట పెట్టుకోలేడు. గుప్పిడి మూసుకొని బతుకుతున్నాడు — మనకూ ఆళ్లకూ తేడా లేదే — మనం ఏదో రోజు కూలీ ఆ రోజు తెచ్చుకుంటాం. ఆళ్లునెల కోసారి తెచ్చుకుంటారు. బతుకులొకటే." ఆ కూలీ మాటలు నరసరాజును బాధించాయి.

చాలీచాలని జీతాలతో గౌరవంగా, గుట్టుగా సంసారాలు లాక్కువస్తున్న ఉపాధ్యాయులు, ఎన్. జి. ఓ. లు ఇలాంటి సమయాలలో చాలా బాధపడతారు. ఇదే అదనని ధరలు ఒకేసారి వేగం పుంజుకుంటాయి — చంద్ర పరిధిలోకి ప్రవేశించడానికి రాకెట్ వేగం పుంజుకొనేటట్లు.

"నడవరా! అందరి గురించి ఆలోచిస్తే ఎవరికీ సాయంచేయలేం. ఆ మాత్రం లేకుండా లేరు వాళ్లు. నిజంగా లేకపోతే అప్పో సొప్పో చేసుకుంటారు. నడు."


ఇలాంటి సందిగ్ధావస్థల్లో కామేశం నరసరాజుని ముందుకు నెడతాడు, కామేశం చెప్పింది నిజమే అనిపించింది. అలా అనిపించకపోతే ఏ మనిషి ముందడుగు వేయలేడు.

నరసరాజు ముందడుగు వేశాడు. రేపు వచ్చింది. వంటలయాయి. భోజనాలవుతున్నాయి. విస్తళ్లు వేసేవారు వేస్తున్నారు. తినేవాళ్లు తినిపోతున్నారు. వాళ్లే మరల పదవ బంతికి సిద్ధం. అదే లేబర్ సంతర్పణ అంటే మరి.

"ఏం 'లైట్' పంపించలేదు? నాకూ అవసరమే" అంటూ పట్టాభిరామయ్య వచ్చాడు.

"నిన్ననే తీసుకెళ్దా మనుకున్నాను."

"తీసుకువెళదామనే సినిమాహాలు కెళ్లాను, అలగా జనం మీద పడ్డారు. ఏం మా రాజా, మా బతుకులు చీకట్లో ఘావాల్సిందేనా అని మొరపెట్టుకున్నారు. చా లైవయ్యా! ఏ ముఖం పెట్టుకు



పట్టుకెళతావు లైటు అని మీద పడ్డారు. తలవంచుకొని వచ్చేశాను. కొంత సర్దుబాటయింది కదా. నీవే తెప్పించు" పట్టాభిరామయ్య తన గోడు చెప్పుకొన్నాడు.

"సూరయ్యా! రాత్రి లైటు ఎక్కడ పెట్టారు?" దగ్గరలో ఉన్న సూరయ్య నడిగాడు నరసరాజు.

"నాకేటి తెలుస్తాది బాబూ! జీవరత్నం గోడి దగ్గరుందనుకుంటుంటే యున్నాను." సూరయ్య తప్పుకున్నాడు.

"ఆడు పొద్దుణ్ణుంచీ ఆపడ్డంలేదు. ఏడ బోయిండో!" పోలయ్య నసిగాడు.

"సారా కొట్టుకు పోయుంట డు." వీరయ్య 'క్లూ' ఇచ్చాడు.

"ఇక్కడ సంతర్పణ జరుగుతుందాయె — అదీగాక చేతిలో డబ్బు లేనప్పుడు సారా కొట్టుకి వెళతాడా?" నరసరాజు నమ్మలేక పోయి అన్నాడు.

"ఏంటో మా రాజా! ఆడి తంతే అది. మీరు నమ్మలేరు. ఏర్నైనా సూసి రమ్మనండి. ఆడుండకపోతే సెవి తెగ్గోయించుకుంటా. ఆఁ" వీరయ్య సాగదీస్తూ అన్నాడు. జీవరత్నం మీద వాళ్లలో ఎవరికీ సదభిప్రాయం లేదని తేలింది.

"నే ముందే అనుకున్నాను. ఇలాంటి ప్రమాదాలొచ్చినప్పుడు ఎవరి జాగ్రత్తలో వాళ్లుంటారని. తమ సరుకులు సవరించుకొనే వారు కొందరైతే, పరాయి వాళ్ల వస్తువులు సవరించి జాగ్రత్తపడే వాళ్లు కొందరు. సరుకు జాగ్రత్తగా చూపి అప్పజెప్పలేని వాడవు సరుకుకోసం కబురుచేయడ మెందుకు? చీకటి పడకుండా 'లైటు' చూసి పంపించు" పట్టాభిరామయ్య ఈ మాటలు అని చరచర వెళ్లిపోయాడు.

ఎదుటి మనిషి పడుతున్న శ్రమ గురించి ఆలోచించక తమ సరుకులకే పాకులాడే మంచి మనుషుల జాబితాలో వాడు పట్టాభిరామయ్య. 'లైటు' సంగతి వాకబు చేసి తీసుకు రమ్మని కామేశాన్ని పంపించాడు నరసగాజు.

"ఈ మజ్జిగ తాగు మా రాజా!" అంటూ ఒక గ్లాసుతో మజ్జిగ తెచ్చి ఇచ్చింది మాచరమ్మ. కష్టసుఖాలు రెండింటినీ సమానంగా సహించి జీవితం నడుపుకోగల స్త్రీ మాచరమ్మ. మజ్జిగ గ్లాసు అందుకున్నాడు నరసరాజు.

"మా రాజే! నీ గూర్సి పట్టించుకోని ఈ రాచ్చసులకోసం ఎంత భమ పడ్తున్నావో. అందర్లాగా నువ్వూ అమ్మ దగ్గర ఎచ్చగా కూకోలేవూ!" అంటోంది మాచరమ్మ. ఆమె అమాయకత్వానికీ, అభిమానానికీ లో లోపల నవ్వుకొని గ్లాసు అందించాడు నరసరాజు.

"అందర్లాగా అమ్మా అయ్యా

కావాల్సొస్తే ఈ డెందు కుంటాడు. కొంపలోనే పడుండును. కష్టం సుఖం బాగా తెల్సును. ప్రజాసేవకుడు కాదూ మరి!" రుసరుసలాడుతూ పదెకరాల రైతు సుబ్బయ్య వచ్చాడు, అందరూ తేరిపార చూశా రతన్ని.

"ఏందైంది?" మాచరమ్మ అడిగింది.

"ఇంకా ఏం కావాలి. ఇప్పటికైన శాస్తి చాలు. మీకు యీళ్ళున్నారు. అక్కడ మేం ఏమైనా ఫర్వాలేదు మీకు. దూడల్ని చూడడానికి పాలేళ్ళ పొలం వెళ్ళక్కర్లేదా?" సుబ్బయ్యగారు గద్దించి మాట్లాడుతున్నాడు.

"ధూమ్ ధామ్ చేస్తారే తప్ప అసలు విషయం చెప్పరేం?" నరసరాజు అన్నాడు.

"ఏడయ్యా మా పాలేరూ?" అంటూనే బంతిలో కూర్చుని ధప్పళంతో భోజనాలు చేస్తున్న వాళ్ల ముఖాలు పరిశీలించసాగాడు సుబ్బయ్య. అప్పటికే యజమాని రావడం కనిపెట్టిన పది హేనేళ్ల పాలేరు సైను బనీనుకు చేతులు రాసుకుంటూ వచ్చి నిలబడ్డాడు వినయంగా.

"ఏరా సన్నాసీ! నోరుంది కదా అని ఇక్కడ కూకొని మింగుతున్నావ్ — బాగానే ఉంది. నోరులేని ఆ జీవాల సంగతి ఏడ్వడం ఉందాని? నిన్న ఆరు కుంచాల బియ్యం పట్టుకెళ్లావు గదరా? మళ్లీ ఈడకెందుకొచ్చావ్? సుబ్బయ్య పాలేరును నిలదీసి అడుగుతున్నాడు.

"ఓరి నీ జిమ్మడా! ఇచ్చిన బియ్యం దాచుకొని యీడు తింటన్నానా?" మాచరమ్మ మెటికలు విరుచుకొంది.

"ఇదిగో నరసరాజయ్యో! సంతర్పణ పెడ్తే ఇదే నష్టం. నిజంగా కావాల్సి వోళ్లకి తిండి దొరకదు. చందాచేశావ్. బాగుంది. ఇంటింటికి తిరిగి కొలిచి ఇస్తే ఎంత బాగుండేదని!" సుబ్బయ్య సలహా ఉచితంగా ఇచ్చి నవ్వి, "ఇంకా నిలబడి చోద్యం చూస్తున్నావా? పద" అని పాలేరు రెక్క పుచ్చుకుని లాక్కుపోయాడు.

అవకాశం ఉన్నవాళ్లు, లేనివాళ్లు ఇక్కడే తినడం ఏం బాగులేదు, కామేశం 'పెట్రొమాక్స్ లైటు' పట్టుకొని వచ్చాడు.

"ఎక్కడుందిరా?" నరసరాజు ప్రశ్న.

"సారా కొట్టు చంద్రయ్యకు మదుపు పెట్టాడు జీవరత్నం."

"ఎత్తి?"

"గుర్రం ఎక్కాను. దిగిరా నన్నాడు. పత్రం మంచాడు. మీరంతాచెడ్డాళ్లు. పోండి అంటున్నాడు, బ్రదర్!" కామేశం నవ్వుతూ అన్నాడు.

ఆపదలు వచ్చినప్పుడే మనిషి నిత్తత్త్వం తెలుస్తుంది. నిజమే మరి. అందుకే సుఖంలో ఉన్నప్పుడే కొంత కొంత మానసిక పరిణతి సాధించుకోవా లన్నారు.

ఇక్కడ నాకేం లేదనే భావం సాధించడం వల్ల ఉపయోగ మిదే అంటారు వేదాంతులు. ఇదంతా వాదే అని శ్రమించి, జాతి అంతకు వదిలిపోగల నిగ్రహం అలవరుచుకోవాలంటారు రాజకీయ వాదులు. మొదటి రకం తత్త్వం జ్ఞానం ద్వారా సాధ్యం. రెండవ రకం చట్టంతోనే సాధ్యం. కాని చట్టానికి లొంగని మానసిక ధర్మం వేదాంతానికే తల ఒగ్గుతుంది.

ఆ నాటి సంతర్పణ అయింది. సామాన్లు సర్ది పంపుతుండగా సినిమా హాలు మేనేజర్ దుర్వాసుడులా వచ్చాడు.

"ఏమయ్యా, ప్రజాసేవన్నావ్ — బాగానే ఉంది. నీవూ చేశావ్ — మా చేతా చేయించావ్. సినిమా హాలంతా చెత్తా చెదారం పోశారు. బయలు దొడ్డిలాగుందది. ఎవడి మట్టుకు వాళ్లు జారుకున్నారు. బాగుచేసేదుందా? లేదా?"

"చేయిస్తా" అంటూనే నరసరాజు దగ్గర్లో ఉన్న ఇద్దరిని పిలిచాడు.

"పంచాయితీలో కొబ్బరి చీపుళ్ళు, గంపలు తీసుకుని, సినిమా హాలు ఊడవండి."

"నానా రకాల వాళ్ల ఉమ్మిలూ ఊడవడానికి మేం పాకీవోళ్ళంకాదు" అన్నారు వాళ్లిద్దరూ బిగ్గరగా.

పక్కఇంటివాళ్ళకామాత్రం సాయం చేస్తాం. కాని అదే పదిమంది కలిస్తే ఒక్కడూ ముందుకు రాడేం?

మరొకణ్ణి పిలిచాడు నరసరాజు.

"నా కిదే పనటయ్యా! కొంప సరుదుకోవాల" అంటూ జారుకున్నాడు వాడు. నరసరాజు ఇబ్బందిగా చూశాడు.

"మా అందరికీ చేతకాక ప్రజాసేవ మానుకోలేదు. ఇదిగో, వీళ్లతో యిలాగే ఉంటుంది. వాళ్లకు తప్పింది కాని నీకు తప్పుతుందా మరి? పద."

మేనేజర్ నవ్వాడో, పరిహసించాడో, సానుభూతి ప్రదర్శించాడో నరసరాజుకు అర్థం కాలేదు.

"రారా" అన్నాడు కామేశంతో.

"నే నీ 'లైట్' ఇచ్చి వస్తాను. నీవు పద." కామేశం తప్పుకొందుకు, తప్పించుకొందుకు లైటును ఆసరా చేసుకొని వెళ్లిపోయాడు.

నరసరాజు ముందుకు నడిచాడు. పంచాయతీ ఆఫీసులోంచి వస్తుంటే పరంజ్యోతి కనపడింది. విషయం అర్థం చేసుకున్న ఆమె "నేనూ వస్తా!" అని మరొక చీపురు, గంప తీసుకువచ్చింది.

మేనేజరు లాంతరు వెలిగించి ఇచ్చాడు. పరంజ్యోతి, నరసరాజు హాలు బాగు చేస్తుంటే మేనేజరు కులాసా కబుర్లు చెపుతూ నిలబడ్డాడు.

"నీ విక్కడున్నావా? రా! తాశీల్దార్ గారు రమ్మంటున్నారు. తుఫాను బాధితుల ఇళ్లు పరిశీలించి పేర్లు వ్రాసుకోవాలట. రా!" అంటూ వచ్చాడు పట్టాభిరామయ్య. హాలు సగం కూడా ఊడవడం పూర్తి కాలేదు. వెళ్లడమా, ఉండడమా అని ఆలోచిస్తున్నాడు నరసరాజు.

"ఆయన మొగలో ఉన్నారు. ఈ పని పరంజ్యోతి చూస్తుందిలే. పద" పట్టాభిరామయ్య తొందరచేశాడు.

"ఏం, జ్యోతీ?" నరసరాజు అడిగాడు.

"వెళ్లండి బాబూ! నే నూడ్చివస్తాగా. పరంజ్యోతి సన్నజాజి పువ్వులా నవ్వింది.

నరసరాజు, పట్టాభిరామయ్య బయటపడ్డారు.

రా బందులు చరిపిన అస్థిపంజరం వంటి సమాజాన్ని బాగుచేయడానికి ఎప్పటికప్పుడు నిత్య పవిత్రులూ, త్యాగులూ వస్తూనే ఉంటారు.


నరసరాజు, పట్టాభిరామయ్య రోడ్డు కెక్కుతారని నిర్ధారించుకున్న మేనేజరు "ఏం పిల్లా! రా!" అన్నాడు.

పరంజ్యోతి గలగల నవ్వింది.

* * *

త్యాగుల్ని, మానవతావాదుల్ని అస్థిపంజరాలు చేయాలని స్వార్థపు రాబందులు రెక్కలు విప్పుతూనే ఉంటాయి. ఆ రెక్కల తాకిడి నుండి తప్పుకుంటూ రాబందుల కాలిగోళ్ల కట్లను సహిస్తూ వాళ్లు ముందుకు చూస్తూనే, పోతూనే ఉంటారు. ఆ సంఘర్షణే మనిషి మనసు లోని తుఫాను.

ప్రకృతి రేపిన తుఫాను అప్పుడప్పుడు వస్తుంది. కాని, నరసరాజు వంటి మంచి వాళ్ల మనస్సులో ఎప్పుడూ తుఫానులే! ★



ముద్దొస్తోంది    ఫోటో—ఎస్. బి. టకల్కర్ (కొల్హాపూర్)